క్లుప్తంగా

యోగాపై సచివాలయ సిబ్బందికి శిక్షణ



కొల్లూరు: యోగాంధ్రలో భాగంగా సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. గురువారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభమైన యోగా శిక్షణ కార్యక్రమం సోమవారం వరకు ఐదు రోజులపాటు జరగనున్నట్లు శిక్షకులు వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాలో నిష్ణాతులైన శిక్షకులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీవో కె.నరసింహారావు తెలిపారు. యోగాంధ్ర 2025 ప్రచారంలో భాగంగా చేపడుతున్న శిక్షణలో భాగంగా యోగా శిక్షణలో పెద్ద ఎత్తున సమాజ భాగస్వామ్యం అవసరమని ఎంపీడీవో అన్నారు.

యోగాతో మానసిక, శారీరక దృఢత్వం

ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: యోగాసనాలతో మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం కర్లపాలెంలోని పెనుమెత్స కోటంరాజు వెంచర్‌లో జరిగిన సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ ప్రారంభోత్సవంలో ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేదీన విశాఖలో జరిగే యోగా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారని తెలిపారు. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2 కోట్ల మంది యోగాసనాలు వేస్తారని ఎంపీడీవో తెలిపారు. యోగా గురువులు ఆయుష్ డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్వాస మీద ధ్యాస ఉంచి యోగాసనాలు వేయటం వలన శారీరకంగా, మానసికంగా దృఢత్వం కలిగి ఉండటంతో పాటు ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు వెంకట నరసింహ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలి

చుండూరు(వేమూరు): ప్రభుత్వం ఉపాధి కూలీలకు గత 8 వారాల నుంచి వేతనాలు విడుదల చేయడం లేదని, వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొనిగల అగస్టీన్ డిమాండ్ చేశారు. చుండూరు మండలంలో ఉపాధి పని ప్రదేశాలలో గురువారం ఆయన పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొని రావడం జరిగిందన్నారు. అధికారులు యోగాలు చేయడం కాదు కష్టపడి పని చేసిన కూలీలకు వేతనాలు విడుదల చేయాలని ఆయన కోరారు. కూలీలకు 100 రోజులు ఉపాధి ఎక్కడా అమలు జరగడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధికి గతం కంటే నిధులు తగ్గించిందని విమర్శించారు. మేట్లుకు పారితోషకం పునరుద్ధరించాలని, పనిలో గాయాలు అయితే కనీసం మెడికల్ కిట్స్ కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కూలీలకు పలుగు, పార పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్గో సేవలు ఉపయోగించుకోండి

ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



తెనాలిఅర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ఏర్పాటు చేసిన కార్గో సేవలను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం తెలిపారు. గతంలో పార్సిల్ పంపించదలచిన వారు డిపోకు రావాల్సి ఉండేదని చెప్పారు. నూతనంగా కార్గో సేవలను బస్సుల్లో ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బస్సు కండెక్టర్‌కు పార్సిల్‌ను అందజేస్తే వారు ఆయా ప్రాంతాలకు డెలివరీ చేసే అవకాశాన్ని ఉన్నతాధికారులు కల్పించారన్నారు. కండెక్టర్‌కు పార్సిల్ ఇవ్వగానే సెండర్, రీసివర్ ఫోన్ నెంబర్లకు మేసేజ్‌లు కూడా పంపే ఏర్పాటు చేసామన్నా రు. జూన్ 1 నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు డిపోలో సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. రామలింగేశ్వరపేట, చినరావూరులో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగుకాల్వలను ప్రతిరోజు బాగు చేయించే విధంగా చూడాలని పలువురు కోరారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పొట్ట నింపని బుట్టలు

నిరుపేదల ఆకలిపై ప్లాస్టిక్ పోటు



కనకాద్రినగర్‌లో బుట్టలు అల్లుతున్న నిరుపేదలు

బాపట్ల: ఏళ్ల తరబడి బుట్టల అల్లికే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న నిరుపేదలు ప్రస్తుతం ప్లాస్టిక్ వస్తువుల విక్రయాల వలన పూట గడవని స్థితిలో ఉన్నారు. పాలకులు కనీసం వారిని పట్టించుకోవడం లేదు. మండలంలోని కనకాద్రినగర్‌లో గత 12 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న ఎస్టీలకు వంశపారంపర్యంగా వస్తున్న వృత్తి బుట్టల అల్లిక.. రోజంతా భార్య, భర్త కలిసి 4 బుట్టలు మాత్రమే అల్లగలరు. గతంలో ఏ గ్రామానికి బుట్టలు తీసుకెళ్లినా వెంటనే కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం ప్లాస్టిక్ వస్తువులు విరివిగా వాడుకలోకి రావడంతో ఎవరూ కొనడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి రేషన్‌కార్డులు కూడా లేవు. దీంతో ఏ ఒక్క సంక్షేమ పథకం అందడం లేదు. రేషన్ బియ్యాన్ని అయినా అందిస్తే కొంతమేరకు ఆకలి తీరే అవకాశం ఉందని కోరుతున్నారు.

నేడు కార్యకర్తల సమావేశానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలి

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



చెరుకుపల్లి: కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల అనుసరిస్తున్న నిరంకుశ పాలనపై జూన్ నెల 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రేపల్లెలో జూన్ 4న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయిలోని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగు నాగార్జున పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు, వివిధ విభాగాల పార్టీ అధ్యక్షులు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని డాక్టర్ గణేష్ కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శిఖరేశ్వరస్వామి ఆలయ జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట

చెరుకుపల్లి: మండలంలోని నడింపల్లి గ్రామంలో వేంచేసియున్న శిఖరేశ్వరస్వామి ఆలయ జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. జీవ ధ్వజస్తంభంతో పాటు అదేరోజు నవగ్రహ, ఇతర మూర్తుల విగ్రహాలు కూడా బ్రహ్మశ్రీ నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో రుత్వికుల ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రతిష్ఠించడం జరుగుతుందని, ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సినిమా థియేటర్‌లలో తనిఖీలు



థియేటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె: నిబంధనలకు విరుద్ధంగా నడిపే సినిమా థియేటర్‌లపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని రాజ్యలక్ష్మి, బసవేశ్వర థియేటర్‌లలో గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అనుగుణంగా మాత్రమే టికెట్లు, తినుబండారాలు, పానీయాలు విక్రయించాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. థియేటర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఏటా థియేటర్‌ల లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకుంటూ అన్ని శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌లను తీసుకోవాలన్నారు. ఆయన వెంట వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేత



వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని చించివేసిన దృశ్యం

రేపల్లె: కూటమి నేతల అండదండలతో కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. తాము ఏం చేసినా అడ్డుకునే వారు లేరంటూ విర్రవీగుతున్నారు. వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పుట్టినరోజును పురస్కరించుకుని పట్టణంలోని పలువురు నాయకులు గణేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఇండియన్ బ్యాంక్ రోడ్డులోని 23, 24 వార్డుల సమీపంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలను చూసి ఓర్వలేని కూటమి కార్యకర్తలు నాయకుల ప్రోద్బలంతో బుధవారం అర్ధరాత్రి ఫ్లెక్సీలను చింపివేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు.

చివుకుల ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి



మాట్లాడుతున్న విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు ప్రసాద్

బాపట్ల: బానిసత్వంతో సతమతమయ్యే వారికి చైతన్యం కలిగించి వారి హక్కుల కోసం పోరాటాల్లో అగ్రగామిగా నిలిచిన కామ్రేడ్ చివుకుల శేషశాస్త్రి మరణించి 75 ఏళ్లైనా ప్రజల్లో ఆయన ఆశయాలకు మరణం లేదని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. గురువారం శేషశాస్త్రి స్మారక కమిటీ ఆధ్వర్యంలో శేషశాస్త్రి వర్ధంతి సందర్భంగా బాపట్ల కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన శేషశాస్త్రి స్మారక సభలో ఆయన మాట్లాడారు. సభకు శేషశాస్త్రి స్మారక కమిటీ చైర్మన్ కారుమంచి విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా శేషశాస్త్రిని స్మరించుకుంటున్నామంటే ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన విప్లవకారుడు శేషశాస్త్రి అన్నారు. ఆయనను స్మరించుకుంటే ప్రజల హక్కులకై ప్రాణాలర్పించిన కమ్యూనిస్టు ఉద్యమకారులందరినీ స్మరించుకున్నట్లేనన్నారు. ప్రజల్లో నిరంతరం జీవించే ఉండే వారిలో చివుకుల శేషశాస్త్రి ఒకరన్నారు. శేషశాస్త్రి స్ఫూర్తి నేటి తరానికి అవసరమని అన్నారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘాన్ని బాపట్లలో ఏర్పాటు చేసి వారి సమస్యలపై పోరాటం చేశారన్నారు. ఇప్పటికీ బాపట్ల ఉప్పరపాలెం ప్రాంతంలో కొన్ని కుటుంబాల్లోని పిల్లలకు శేషశాస్త్రి అని పేరు పెట్టుకున్నవారు ఎంతో మంది ఉన్నారన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మేకల ప్రసాద్ మాట్లాడుతూ శేషశాస్త్రి స్ఫూర్తితో ప్రజలు ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శేషశాస్త్రి నిమ్న జాతులకు సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించేందుకు పోరాటం చేశారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ మాట్లాడుతూ శేషశాస్త్రి ఉద్యమ స్ఫూర్తితో నేడు కమ్యూనిస్టులు ఉద్యమం నడిపితేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, కోట వెంకటేశ్వరెడ్డి, కృష్ణ, శోభారాణి, పొందుగుల మస్తాన్‌రావు, గుదే రాజారావు, కొండయ్య, టి.కృష్ణమోహన్, నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, సుభాషిణి పాల్గొన్నారు.

టిడ్కో నివాసాల్లో మౌలిక వసతులు కల్పించాలి



ప్రజల సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జీఎంసీ, టిడ్కో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మౌలిక వసతులపై ప్రజలు తెలిపిన సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం తాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. పారిశుద్ధ్య సమస్యలపై ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, కార్పొరేటర్ బి.స్మితపద్మజ, జీఎంసీ డీఈఈలు శ్రీనివాస్, హనీఫ్, టిడ్కో డీఈఈ సేతుబాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నిజాంపట్నం క్రీడాకారులు



నిజాంపట్నం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నిజాంపట్నంకు చెందిన ఇరువురు క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం నిజాంపట్నంలో ఆయన అభినందించి మాట్లాడారు. నిజాంపట్నంకు చెందిన పీతా కార్తిక్, సిద్ధార్థలు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నారని చెప్పారు. ఇండియా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్‌లో జూన్ 1వ తేదీ వరకు జరగనున్న పోటీలకు హాజరవుతారన్నారు. పోటీలలో ప్రతిభ చాటి తీరప్రాంతానికి గర్వకారణంగా నిలవాలన్నారు. క్రీడాకారులకు శిక్షణనిచ్చిన రోహిత్‌ను ఆయన అభిందించారు.

తెనాలి సమాజం నాటికకు రెండు బహుమతులు



జ్యూరీ బహుమతిని అందుకుంటున్న సమాజం బాధ్యులు

తెనాలి: పల్నాడు జిల్లా సాతులూరులో ఈనెల 24–28వ తేదీల్లో జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఆహ్వాన నాటికల పోటీల్లో తెనాలి సమాజం తొలి ప్రదర్శనలోనే రెండు బహుమతులను అందుకోవటం విశేషం. అద్దేపల్లి–ఆరాధ్యుల ఆర్ట్స్, తెనాలి సమాజం చివరిరోజైన 28వ తేదీ రాత్రి 'ఎవరు' సాంఘిక నాటికను ప్రదర్శించారు. ఉత్తమ 'బాలనటి', ఉత్తమ ప్రదర్శన 'జ్యూరి' బహుమతులను ఈ నాటిక గెల్చుకుంది. ప్రముఖ కూచిపూడి నర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య రచించిన ఈ నాటికకు, పట్టణ నటుడు, దర్శకుడు అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి దర్శకత్వం వహించారు. నాటిక ప్రదర్శనకు జ్యూరీ బహుమతి రాగా, ఇందులో నటించిన పేరుబోయిన మహితకు ఉత్తమ బాలనటి బహుమతిని అందుకుంది. 'ఎవరు' నాటిక ప్రదర్శించిన మొదటి ప్రదర్శనలోనే రెండు బహుమతులను గెలచుకోవడం పట్ల కూచిపూడి నృత్యగురువు చల్లా యామిని, తెనాలి కళాకారులు ఆరాధ్యుల కన్న, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, పేరుబోయిన మహితను అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో ఒక్క దివ్యాంగుడికి కొత్త పింఛన్ ఇవ్వలేదు

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య



మాట్లాడుతున్న చల్లా రామయ్య పక్కన డాక్టర్ గణేష్ తదితరులు

చెరుకుపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయినా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చక పోగా వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధిస్తూ చివరకు దివ్యాంగులను కూడా వదలటం లేదని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మండిపడ్డారు. గురువారం గుళ్ళపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశానికి వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు, సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ చల్లా రామయ్య జిల్లాలో దివ్యాంగుల అభ్యున్నతి కోసం వైఎస్సార్‌సీపీ తరఫున కృషి చేస్తున్నాడని చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వం దివ్యాంగుడు అని కూడా చూడకుండా రామయ్యపై కేసులు పెట్టడం హేయమైన చర్య అని అన్నారు. అనంతరం చల్లా రామయ్య మాట్లాడుతూ చంద్రబాబు అధికారం చేపట్టిన సంవత్సర కాలంలో ఎందరో యువకులు, వృద్ధులు, మహిళలు అనేక ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయి వికాలంగులుగా జీవిస్తున్నారని, అటువంటి ఏ ఒక్కరికీ కొత్త పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. అంతే కాకుండా చంద్రబాబు ఎన్నికల సభల్లో 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్ అందిస్తామని చెప్పి.. ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వకుండా ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి వారి ఇంటికే వచ్చి పింఛన్ అందించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో దివ్యాంగులను ఏకం చేసి జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేస్తామని రామయ్య అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యార్లగడ్డ మదన్‌మోహన్‌రావు, మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, బాపట్ల జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు వంగరు భాను, నాయకులు పీటా మోహన్, గాలికుంటు రాజశేఖర్, బొమ్మిడి శ్రీనివాసరావు, శీలం శివగంగ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి శామ్యూల్



ఇన్‌చార్జి కమిషనర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

రేపల్లె: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి ఇన్‌చార్జి కమిషనర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకై ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తూ మృత్యువాతకు గురైతే వారి కుటుంబంలోని ఒకరికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పైబడిన అవుట్‌సోర్సింగ్ కార్మికులను విధుల నుంచి తొలగించి ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాతో పాటు పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలన్నారు. కార్మికులకు ప్రతి నెల ఇవ్వవలసిన కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, చేతి గ్లౌజులు, యూనిఫాం తదితరాలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఇంక్రిమెంట్లు, బ్యాంకు రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ కోన శ్రీను, ఏఐటీయూసీ బాపట్ల జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి సింగం వాణిశ్రీ, ఏఐటీయూసీ నాయకులు పడమటి బిక్షాలు, ముత్యాల లక్ష్మణరావు, ఎర్రంశెట్టి పోతురాజు, చుక్కాకుల వెంకటేశ్వరమ్మ, దున్న చిన్నారిబాబు, దున్న కిరణ్, ఎర్రంశెట్టి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఆయుధాల శిక్షణ



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

గుంటూరు రూరల్: సమాజానికి సేవ చేసే శక్తివంతమైన యువతను సన్నద్ధం చేసేందుకు ఎన్‌సీసీ ప్రత్యేక శిక్షణ శిబిరం దోహదపడుతుందని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఆధ్వర్యంలో కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్–1 శిక్షణ తరగతులు గురువారం కొనసాగాయి. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఆయుధాల వినియోగంపై శిక్షణను అందించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు భద్రతా నియమావళి, ఆయుధాల ఉపయోగం, ప్రాధాన్యత అంశాలను వివరించారు. లీగల్ అడ్వైజర్ అనురాధ మాట్లాడుతూ.. ఈ తరగతుల ద్వారా విద్యార్థులకు దేశ భద్రత, చట్టబద్ధత, తదితర అంశాలపై అవగాహన పెంపొందుతుందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదల బలోపేతమవుతుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు అన్నారు. ఈ శిక్షణ విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంచుతుందని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్‌లు అన్నారు. విద్యార్థులను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, అభినందించారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ పట్వాల్, క్యాంపు సీనియర్ జేసీవో ఇమాంసాహెబ్, ట్రైనింగ్ జేసీవో రాజు, సూపరింటెండెంట్ రాజశేఖరబాబు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందస్తు ఖరీఫ్ ప్రణాళికలలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, భూసార పరీక్షలు, నూతన వంగడాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. వివిధ పంటలలో సస్యరక్షణ చర్యలు, పశు పోషణలో మెళకువలను రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.శోభమణి, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వేంకటేశ్వర్లు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యం.యుగంధర్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి, డీపీఎం రాజకుమారి, మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం, అధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, రైతులు నామా శ్రీనివాసరావు, వంగా నవీన్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేధించిన రౌడీషీటర్ అరెస్ట్

తెనాలిరూరల్: వివాహితను లైంగిక వేధింపులకు గురి చేసి ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కారకుడైన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ గురువారం తెలియజేశారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ ప్రేమిస్తున్నానంటూ వెంటబడే వాడు. ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడు. అంతేకాక ఆమెతో తనకు వివాహేతర సంబంధం ఉందని గ్రామంలో ప్రచారం చేశాడు. ఈ నేపథ్యంలో ఆమె ఏప్రిల్ నెల 4వ తేదీన పోలీసులను ఆశ్రయించగా అదే నెల 22వ తేదీన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మరుసటి రోజు 23వ తేదీన బెయిలు రావడంతో గ్రామానికి వెళ్లిన మహేష్ తనను పోలీసులు ఏమీ చేయలేకపోయారని, నీ అంతు తేలుస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన సదరు వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఏప్రిల్ 24వ తేదీన మృతి చెందింది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించడంతో నరసరావుపేట సబ్‌జైలుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.